నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, మంగళవారం 27 ఆగస్టు 2024 | SURYAPET

## ఆధ్యాత్మిక ఉట్టిపడేలా ప్రత్యేక డోనర్ సెల్

యాదగిరిగుట్ట, ఆగస్టు 26 : యాదగిరిగుట్ట కొండ పైన డోనర్ సెల్‌ను ఆలయ అధికారులు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ప్రత్యేకంగా నిర్మించారు. మాఢవీధుల్లోకి లిఫ్టు, రథశాల మధ్యలో సుమారుగా 300 ఎస్ఎఫ్‌టీలో దాతలు అందజేసే సహాయాన్ని స్వీకరించేందుకు ప్రత్యేక హాల్ నిర్మించారు. గతంలో పశ్చిమ రాజగోపురం పక్కనే అష్టభుజి ప్రాకార మండపంలో తాత్కాలికంగా ఏర్పాటు చేయగా దాతలకు కనిపించకుండా ఉండటంతో పాటు సరిపడా స్థలం లేకుండా ఉంది. ఈ పరిస్థితిని గమనించిన దేవస్థాన అధికారులు మాఢవీధుల్లో భక్తులకు కనిపించే విధంగా విశాలమైన హాల్‌ను నిర్మించగా అందుబాటులోకి రానుంది. పై భాగంలో స్వామివారి ప్రతిమతోపాటు ఇరువైపులా ద్వారపాలకుడు, గరుత్మండుడి ప్రతిమలను, కింది భాగంలో ఐరావతాలు, దర్వాజలకు పద్మాలు, ఇరువైపులా యాళీ ఫిల్లర్లను అమర్చి అద్భుతంగా తీర్చిదిద్దారు.




కొండపైన రథశాల పక్కన నిర్మించిన డోనర్ సెల్

# కాంగ్రెస్‌లో ‘నామినేటెడ్’ చిచ్చు

## రసకందాయంలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

- ఇప్పటికే బండ్రు శోభారాణి, పటేల్ రమేశ్‌రెడ్డి, పాల్వాయి రజినికుమారి
- తాజాగా గుత్తా అమిత్‌రెడ్డికి డెయిరీ కార్పొరేషన్ చైర్మన్
- పార్టీ అధిష్టానం వద్ద జిల్లా సీనియర్ల తీవ్ర అభ్యంతరం
- అలా వచ్చినోళ్లకు ఇలా పదవులా అంటూ గుస్సా
- సోషల్ మీడియాలోనూ కాంగ్రెస్ శ్రేణుల రచ్చ రచ్చ
- పెండింగ్‌లో అమిత్‌రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ పోస్టు?

### నల్లగొండ జిల్లాలో నామినేటెడ్ పదవులన్నీ రేవంత్ వర్గానికే..



తెలంగాణ కాంగ్రెస్‌లో నల్లగొండ సీనియర్ లీడర్లదే హవా! .. ఇది ఒకప్పటి మాట. నేడు అలాంటి సీనియర్లు సొంత జిల్లా నల్లగొండలోనే డమ్మీ అయ్యారా? అంటే అవుననే సమాధానం ఆ పార్టీ శ్రేణుల నుంచే వినిపిస్తున్నది. పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి వ్యూహాత్మకంగా సీనియర్లకు చెక్ పెడుతూ నల్లగొండ జిల్లాపై పట్టు బిగిస్తున్నారనడానికి నామినేటెడ్ పోస్టుల భర్తీనే ఉదాహరణగా చూపుతున్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా పరిధి నుంచి ఐదు నామినేటెడ్ పోస్టులకు ఎంపిక చేసిన వారిలో నలుగురు రేవంత్‌రెడ్డి వర్గీయులే అవడం గమనార్హం. వారంతా రేవంత్‌రెడ్డితోపాటు లేదా ఆ తర్వాత కాంగ్రెస్‌లోకి వచ్చిన వారే. దాంతో అలా వచ్చిన వారికి ఇలా పదవులు ఇచ్చుడేంది అన్న రంది అసలైన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తల్లో నెలకొంది. సోషల్ మీడియా వేదికగా పార్టీ అధిష్టానాన్ని టార్గెట్ చేస్తూ తమ ఆగ్రహాన్ని, ఆవేదనను కూడా బాహాటంగానే వెళ్లగక్కుతున్నారు. ఆది నుంచీ పార్టీ కోసం కష్టపడుతూ నామినేటెడ్ పోస్టుల రేస్‌లో ఉన్న కొందరు ముఖ్యులు జిల్లా సీనియర్ నేతలను ఇదే విషయం మీద నిలదీసినట్లు తెలిసింది. తప్పనిసరి పరిస్థితుల్లో జిల్లాకు చెందిన ఓ సీనియర్ నేత నేరుగా పార్టీ హైకమాండ్ దృష్టికి వీళ్ల అభ్యంతరాలను తీసుకెళ్లినట్లు సమాచారం. దాంతో ఇటీవల ప్రకటించిన మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి పోస్టులను తాత్కాలికంగా పెండింగ్‌లో పెట్టినట్లు ఆ పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది.

– నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ)

రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన తొలినాళ్లతోపాటు పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ప్రారంభ రోజుల్లోనూ నల్లగొండ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలే ఆయనకు కొరకరాని కొయ్యగా మారిన విషయం తెలిసిందే. అలాంటి సీనియర్ నేతలకు వ్యూహాత్మకంగా ఇప్పుడు రేవంత్ వరుస షాక్‌లు ఇస్తుండడం జిల్లా కాంగ్రెస్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఎంపీ ఎన్నికల్లో నల్లగొండ, భువనగిరి ఎంపీ అభ్యర్థుల ఎంపికలోనూ రేవంత్‌రెడ్డిదే కీలక పాత్ర. ఆ తర్వాత నామినేటెడ్ పోస్టుల భర్తీలోనూ జిల్లా సీనియర్ల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోలేదన్న చర్చ జరుగుతున్నది. ఇప్పటివరకు జిల్లాకు చెందిన ఐదుగురికి నామినేటెడ్ పోస్టులు దక్కగా అందులో నలుగురు రేవంత్‌రెడ్డికి వర్గానికి చెందినవారే అవడం గమనార్హం. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డితోపాటు రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ బండ్రు శోభారాణి, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యురాలిగా పాల్వాయి రజినికుమారి, రేవంత్‌రెడ్డితోపాటు టీడీపీలో పనిచేస్తూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ రేవంత్‌రెడ్డి కోటాలోనే నామినేటెడ్ పదవులు దక్కాయని ఆ పార్టీ వర్గాలే చెప్పుకున్నాయి. తాజాగా ఈ నెల 20న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కుమారుడు గుత్తా అమిత్‌రెడ్డికి రాష్ట్ర డెయిరీ అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ పదవి లభించింది. అయితే శాసన మండలిలో సంఖ్యా బలం రీత్యా చైర్మన్ సుఖేందర్‌రెడ్డితో ఉన్న రాజకీయ అవసరాలతో పాటు రేవంత్‌రెడ్డికి గుత్తా ఫ్యామిలీతో ఉన్న బంధుత్వం కూడా అమిత్‌రెడ్డికి చైర్మన్ పదవి దక్కడంలో కీలక అంశాలుగా తెరపైకి వచ్చాయి. ఇవన్నీ ఎలా ఉన్నా అమిత్‌రెడ్డికి పదవి కట్టబెట్టడం అనేది గత నామినేటెడ్ పోస్టుల మాదిరిగానే రేవంత్‌రెడ్డి స్వతహాగా తీసుకున్న నిర్ణయమన్నది ఆ పార్టీ సీనియర్ల ఆరోపణ. దాంతో ఇవన్నీ జిల్లా మంత్రులు, ఇతర సీనియర్లకు మింగుడు పడని అంశాలుగా మారాయి. ఇదే సమయంలో నామినేటెడ్ పోస్టులు ఆశిస్తున్న ఇతర ముఖ్య నేతలు తమ అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ జిల్లా మంత్రులకు మొర పెట్టుకున్నట్లు తెలిసింది. ఒకప్పుడు రాష్ట్ర కాంగ్రెస్‌కు దశ దిశలను నిర్దేశించిన జిల్లా సీనియర్లకు పోస్టుల భర్తీ వ్యవహారం అవమానంగానే మారిందన్న టాక్ ఆ పార్టీ వర్గాల్లో జోరుగా నడుస్తున్నది.

### ఆశావాహుల గుస్సా...

మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీని అంటి పెట్టుకుని అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడ్డ పలువురు ముఖ్య నేతలు ఎప్పటి నుంచే నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. వారి ఎదురుచూపులకు మాత్రం ఫలించలేదు. ఎమ్మెల్యేలుగా గెలిచి మంత్రులైన కీలక నేతలు, ఎంపీలు ఇప్పుడు తమను పట్టించుకోవడం లేదని నిజమైన కాంగ్రెస్ నేతలు గుస్సా వ్యక్తం చేస్తున్నారు. జిల్లా మంత్రులు, కీలక నేతల వద్ద ఆశావాహులైన పలువురు నేతలు తమ కష్టానికి విలువ లేదా? పార్టీని నమ్ముకుంటే ఇంతేనా? మీరు అందలం ఎక్కితే సరిపోతుందా? మా పరిస్థితి ఇంతేనా? అన్న ప్రశ్నలు సంధిస్తున్నట్లు తెలిసింది. డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పార్టీ నేతలు అద్దంకి దయాకర్, పున్న కైలాస్ నేత, గుమ్ముల మోహన్‌రెడ్డి, ఇంకా పలువురు నేతలు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టులను ఆశిస్తూ వస్తున్నారు. ఇలాంటి వారంతా ప్రస్తుతం సీనియర్ల వద్ద తమ అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. దాంతో ఇటీవల జిల్లాకు చెందిన సీనియర్ నేత ఒకరు నేరుగా ఢిల్లీలో పార్టీ హైకమాండ్ వద్దే తన గళం విప్పినట్లు తెలిసింది. పార్టీ నమ్ముకున్న నేతలకు న్యాయం చేయకపోతే క్యాడర్‌లో విశ్వాసం కోల్పోతామని హెచ్చరించినట్లు సమాచారం. వారితోపాటు రాష్ట్రంలోని పలువురు ముఖ్యులు కూడా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు తెలిసింది. దాంతో తాత్కాలికంగా పోచారం శ్రీనివాసరెడ్డికి క్యాబినేట్ హోదాతో ఇచ్చిన వ్యవసాయ సలహాదారు పదవిని, గుత్తా అమిత్‌రెడ్డికి ఇచ్చిన డెయిరీ సహకార సమాఖ్య చైర్మన్ పదవిని పెండింగ్‌లో పెట్టినట్లు సమాచారం.



జిట్టా బాలకృష్ణారెడ్డి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ వినోద్, మాజీ ఎమ్మెల్యేలు కిశోర్, భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి

## జిట్టాకు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పరామర్శ

సూర్యాపేట టౌన్, ఆగస్టు 26 : అనారోగ్యం కారణంగా కొన్ని రోజుల నుంచి హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డిని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఉమ్మడి నల్లగొండ జిల్లా నాయకులతో కలిసి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాలకృష్ణారెడ్డికి అందిస్తున్న వైద్యం వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. జిట్టా బాలకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని, జిట్టా త్వరలో కోలుకుంటారని తెలిపారు. ఆయన వెంట మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, బూడిద భిక్షమయ్యగౌడ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, నోముల పరమేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

## • గోకుల కృష్ణ.. గోపాల కృష్ణ



నల్లగొండలో ఉట్టి కొడుతున్న మాజీ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్

**శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఆలయాలు, గ్రామ కూడలిలో ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని సంబురంగా నిర్వహించారు. యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. పలు పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించగా చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు.**

## నేడు నల్లబ్యాడ్జీలతో ఆర్టీసీ కార్మికుల నిరసన

- ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్

నల్లగొండ సిటీ ఆగస్టు 26 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ మంగళవారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలుపనున్నట్లు ఆర్టీసీ కార్మికులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు అడ్డుకట్ట వేసేందుకు అన్ని కార్మిక సంఘాలతో కలిసి నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

## రుణమాఫీ కోసం 29న కలెక్టరేట్ ఎదుట ధర్నా

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, ఆగస్టు 26 : రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో రైతులకు రూ.2 లక్షల వరకు గల రూ.42వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత కేవలం రూ.17వేల కోట్ల రుణాలను మాత్రమే మాఫీ చేసి రైతులను మోసం చేశారన్నారు. షరతులు లేకుండా రుణమాఫీని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీజన్ ముగుస్తున్నా ఇప్పటి వరకు రైతుభరోసా కింద నిధులను విడుదల చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల్లో సమృద్ధిగా నీరున్నందున చెరువులు, కుంటలను నింపి చివరి భూములకు నీరందించాలని కోరారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయ వంతం చేయాలని కోరారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నా యకులు మల్లు గౌతం రెడ్డి, బావండ్ల పాం డు, రాగిరెడ్డి మంగారెడ్డి, వినోద్‌నాయక్, పా పానాయక్, దయానంద్, ఎల్లయ్య, రామారావు, చాంద్‌పాషా, బాషా పాల్గొన్నారు.

## హోరాహోరీగా టెన్నిస్ పోటీలు

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 26 : భువనగిరి జిల్లా కేంద్రంలోని న్యూ డైమెన్షన్ టెన్నిస్ అకాడమీలో రాజా నరసింహారావు మెమోరియల్ ఐటీఎఫ్ వరల్డ్ జూనియర్స్ అండర్-18 టెన్నిస్ పోటీలు సోమవారం హోరాహోరీగా కొనసాగాయి. ఉదయం బాలబాలికల విభాగాల్లో సింగిల్స్ క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లు జరుగగా, మధ్యాహ్నం తర్వాత మెయిన్ డ్రాస్ ఫస్ట్ రౌండ్ కొనసాగింది. మంగళవారం మెయిన్ డ్రాస్ ఫస్ట్ రౌండ్ పూర్తయ్యాక, సెకండ్ రౌండ్ ప్రారంభం కానుంది. వచ్చే నెల ఒకటో తేదీ వరకు ఈ పోటీలు జరుగనున్నాయి.



పోటీలో తలపడుతున్న క్రీడాకారుడు

# ‘సర్కారు’లో సగం సగమే!

## అరకొరగా వైద్యులు.. అందుబాటులో ఉండని మందులు

- సదుపాయాలు లేక ప్రజలకు అందని వైద్యం
- వరుస సంఘటనలతో ప్రభుతాస్పత్రి అంటేనే జంకుతున్న జనం
- సీజనల్ వ్యాధులతో కిటకిటలాడుతున్న హాస్పిటళ్లు
- కలెక్టర్ స్పష్టమైన హామీతో విధుల్లో చేరిన ఎంసీహెచ్ వైద్యులు

**నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు అన్న పాత పాటను తలపిస్తున్నది నల్లగొండ జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల పరిస్థితి. డాక్టర్లుంటే మందులు లేవు.. మందులుంటే టెస్టులు లేవు. డాక్టర్లు, టెస్టులు, మందులుంటే సదుపాయాలు కరువు. టెస్టులు, మందుల కోసం ప్రైవేట్‌కు వెళ్లాల్సిన దుస్థితి వచ్చింది. జిల్లా వ్యాప్తంగా చాలా దవాఖానల్లో ఇదే పరిస్థితి ఉండడంతో ప్రజలు దిక్కులేక ప్రైవేట్ హాస్పిటల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న వేళ దవాఖానలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. దీనికి తోడు నల్లగొండ జిల్లా జనరల్ దవాఖానలో ఇటీవల జరిగిన రెండు ప్రసవ ఘటనలు ప్రజలను ఆందోళన కలిగిస్తున్నాయి. సర్కారు దవాఖాన అంటేనే అమ్మో అనే పరిస్థితి వచ్చింది.**

– నీలగిరి, ఆగస్టు 26




### విధుల్లో చేరిన ఎంసీహెచ్ వైద్యులు

నాలుగు రోజుల కితం నల్లగొండ జిల్లా మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రంలో కుర్చీలోనే గర్భిణి ప్రసవించిన సంఘటనపై జిల్లా యంత్రాంగం నుంచి చర్యలకు ఆదేశాలు జారీ చేయడంతో ఎంసీహెచ్ డాక్టర్లు సామూహికంగా సెలవులు పెట్టారు. మూడు రోజుల నుంచి వారంతా సెలవుల్లోనే ఉన్నారు. అరకొర సిబ్బందితో డెలివరీ చేస్తున్న సమయంలో ఆదివారం గర్భస్థ శిశువు మృతి చెందిన విషయం తెలిసిందే. ఇక దవాఖానలో వైద్యసేవలు పూర్తిగా నిలిచిపోవడంతో కలెక్టర్ నారాయణరెడ్డి స్వయంగా వైద్యులతో మాట్లాడారు. డాక్టర్లకు జారీ చేసిన షోకాజ్ నోటీసులను వెంటనే వెనక్కి తీసుకుంటున్నట్లు చెప్పారు. 80 బెడ్లకు 200 మంది రోగులు వస్తుండడంతో ఇబ్బంది అవుతుందని, సిబ్బంది సరపడా లేరని, సెక్యూరిటీ కూడా సమస్యగా ఉందని డాక్టర్లు చెప్పడంతో వాటన్నింటినీ పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. దాంతో డాక్టర్లు విధుల్లో చేరారు.

### జిల్లాలో 30 శాతం మందే డాక్టర్లు

జిల్లాలోని అన్ని ప్రభుత్వ దవాఖానల్లో డాక్టర్ల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. 24 గంటల పాటు వైద్యసేవలు అందించే జిల్లా కేంద్ర దవాఖాన, నాలుగు ఏరియా ఆస్పత్రుల్లో డాక్టర్లు లేక ప్రజలకు సరైన వైద్యసేవలు అందడం లేదు. జిల్లా జనరల్ దవాఖాన మినహా మిగతా ఆస్పత్రుల్లో 217 మంది (సివిల్ సర్జన్, డిప్యూటీ సివిల్ సర్జన్, సివిల్ అసిస్టెంట్ సర్జన్) వివిధ రకాల వైద్యులు ఉండాలి. కానీ 82 మంది మాత్రమే పనిచేస్తున్నారు. వీరిలో 20 మందిని కాంట్రాక్టు పద్ధతిన ఇటీవల ఎంపిక చేశారు. ఇంకా 135 మంది వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లా జనరల్ దవాఖానలో అన్ని విభాగాల్లో డాక్టర్ల సంఖ్య తక్కువగా ఉండడం వల్ల ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ఆరు విభాగాల్లో 77 మంది డాక్టర్లు, 42 మంది ఎస్ఆర్‌లకుగానూ 33 మంది మాత్రమే పనిచేస్తున్నారు. నరాల వైద్య నిపుణులు, నెఫ్రాలజిస్టులు, ఇతర పలు రకాల ప్రధాన డాక్టర్ల ఊసేలేదు.



నల్లగొండ జిల్లా కేంద్ర దవాఖానలో చికిత్స పొందుతున్న పేషెంట్లు

### దవాఖానల్లో మందుల కొరత

జిల్లా కేంద్ర దవాఖానలో మందుల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. సాధారణ రోగాలకు కూడా మందులు అందుబాటులో లేవు. గ్యాస్ ఫామ్ అయితే తగ్గడానికి వాడే పాంటాబ్ ట్యాబ్లెట్లు లేవు. కడుపు నొప్పికి డైక్లోఫామ్ ఇంజక్షన్‌తో పాటు ట్యాబ్లెట్ కూడా లేవు. కాళ్లు, చేతుల వాపు, దురదకు వాడే లోషన్ సైతం లేవని ఫార్మాసిస్టు చెబుతున్న పరిస్థితి పెద్దాస్పత్రిలో కనిపిస్తున్నది. ‘అదే మంటే స్టేట్ నుంచే రావడం లేదు, మేం చేయం, ఇండెంట్ పెట్టాం, ఇంకా రాలేదు’ అని సమాధానం చెబుతున్నారు.

### ల్యాబ్‌లో అంతంత మాత్రంగానే పరీక్షలు

జిల్లా జనరల్ దవాఖానలో రక్త, మూత్ర, షుగర్ పరీక్షలు అంతంత మాత్రంగానే చేస్తున్నారు. పరీక్షలకు కావాల్సిన కిట్లు అందుబాటులో లేకపోవడం వల్ల బయటకు రాస్తున్నారు. దవాఖానలో వివిధ శస్త్రచికిత్సలకు వచ్చిన రోగులకు మాత్రమే జిల్లా ప్రయోగశాలలో పరీక్షలు చేస్తున్నారు. సాధారణ జ్వరం, సీజనల్ వ్యాధులతో వచ్చిన వారికి మాత్రం బయట చేయించుకోవాలని చెబుతున్నారు. గత ప్రభుత్వం టీ హబ్‌ను ఏర్పాటు చేసి 134 రకాల వైద్య పరీక్షలు చేయాలని నిర్దేశించినప్పటికీ అవి పేపర్లకే పరిమితయ్యాయి. ఎక్కడా సక్రమంగా కార్యరూపం దాల్చడం లేదు. జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీలు, యూహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రుల నుంచి వచ్చిన వాటికి మాత్రమే పరీక్షలు చేస్తున్నారు.

| దవాఖాన | ఉండాల్సిన డాక్టర్లు | ఉన్న డాక్టర్లు | ఖాళీలు |
|---|---|---|---|
| మిర్యాలగూడ | 50 | 22 | 28 |
| దేవరకొండ | 46 | 12 | 34 |
| నాగార్జునసాగర్ | 43 | 14 | 29 |
| నకిరేకల్ | 46 | 21 | 25 |
| జిల్లా కేంద్ర దవాఖాన | 32 | 13 | 19 |
| | 217 | 82 | 135 |

**జిల్లా జనరల్ దవాఖానలో..**

| విభాగం | ఉండాల్సిన డాక్టర్లు | ఉన్న డాక్టర్లు | ఖాళీలు | ఎస్ఆర్‌లు |
|---|---|---|---|---|
| జనరల్ మెడిసిన్ | 15 | 5 | 10 | 9 |
| పీడియాట్రిక్ | 8 | 4 | 4 | 5 |
| జనరల్ సర్జన్ | 15 | 6 | 9 | 9 |
| ఆర్థోపెడిక్ | 9 | 3 | 6 | 3 |
| ఓబీసీ | 15 | 5 | 10 | 5 |
| అనస్తీసియా | 15 | 10 | 5 | 11 |
| | 77 | 33 | 44 | 42 |